పోలీసుల విస్తృత తనిఖీలు

కుత్బుల్లాపూర్, జూలై 8: మేడ్చల్ మైసమ్మగూడలోని ప్రైవేట్ విద్యార్థి వసతిగృహలు, వ్యాపార సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో సోమవారం రాత్రి పేట్‌బషీరాబాద్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్ బృందంతో సందర్శించి గంజాయి, డ్రగ్స్ వాటి కోసం అనువనువునా పరిశీలించారు. విశ్వసనీయంగా వచ్చిన సమాచారం మేరకు పోలీస్‌బృందం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో అలాంటివేమి బయటపడకపోవడంతో అక్కడి విద్యార్థులకు, నిర్వాహకులకు, స్థానికులకు మాదక ద్రవ్యాల నిర్మూళన కోసం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గందరగోళం నిజాంపేట పాలన

- అధికార పార్టీ నేతల జోక్యం.. అధికారులకు ఆటంకాలు
- అధికార యంత్రాంగం పనుల్లో రోజూ అర డజను పార్టీ నేతల చొరబాటు
- కార్యాలయ పనులకు అడ్డంకిగా వస్తున్న వైనం.. అధికారులు సతమతం
- అభివృద్ధి కుంటు పడుతుండటంతో.. తలలు పట్టుకుంటున్న అధికారులు
- విధులకు అడ్డొస్తూ.. అధికారులపైనే గురుకాయిస్తున్న ప్రబుద్ధులు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

దుండిగల్, జూలై 8: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి చిన్న విషయంలో అధికార పార్టీ నేతల జోక్యం పెచ్చు మీరుతుండటంతో అధికారులు ఏ పనిచేయలేక పోతున్నారు. అర డజనుకు పైగా అధికార పార్టీ నేతలు అధికారుల విధుల్లో వేలు పెడుతుండటంతో ఏం చేయాలో..? ఏం చేయకూడదో? తెలియక అధికారులు సతమతమవుతున్నారు. ఫలితంగా అభివృద్ధి కుంటుపడటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా నియోజకవర్గం పరిధిలో ఆరుగురు నేతలు ఎవరికి వారుగా అధికారులపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తున్నది. ఉదాహరణకు ఒక ఏరియాలో సీసీ రోడ్డు వేయాలని ఓ నేత సిఫారసు చేస్తుండగా.. ఆ పార్టీకే చెందిన మరో నేత ఎవరినడిగి నిధులు కేటాయిస్తున్నావ్..? ఫలానా నాయకుడు చెబితే పనులు చేస్తావా..? నేను చెబితే నిలిపేయవా..? అనే రీతిలో అధికారులపై అజమాయిషీ చేస్తుండటంతో తమకెందుకు వచ్చిన గొడవ అన్నట్లు తయారైంది అధికారుల పరిస్థితి. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. 28, 29వ డివిజన్ పరిధిలోని పాతపంచాయతీ కార్యాలయం నుంచి శ్రీరాంకుంటకు వెళ్లే రోడ్డులో 20రోజులుగా మురుగు ఏరులై పారుతుండగా.. అధికారులు, సిబ్బంది అరికట్టలేక పోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా ఒక్కటేమిటి.. చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలు నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో రాజ్యమేలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు సైతం నెలల కొద్ది సాగుతుండటం స్థానికులను చికాకుకు గురిచేస్తున్నది. ఇక టౌన్‌ప్లానింగ్ అనుమతులు, బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించిన విషయంలో ఓ యువ నేత జోక్యం మితిమీరుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎవరిమాట వినాలో.. ఎవరి పనులు చేయలో తెలియని అయోమయంలో అధికారులు కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తున్నది. నేతల ఒత్తిళ్లను తట్టుకోలేని కొందరు అధికారులు విధులకు సెలవు పెట్టుకుంటున్న దాఖలాలు లేకపోలేదంటున్నారు. అసలే సిబ్బంది లేమితో కొట్టుమిట్టాడుతున్న నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం.. నేతల తీరుతో మరింత ఇబ్బందికరంగా మారిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నేతల ఆదిపత్య పోరుతో విసిగిపోయిన కొందరు ద్వితీయశ్రేణి నాయకులు మాత్రం తమతోతాము మధనపడుతున్నట్లు సమాచారం.

లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి

జగద్గిరిగుట్ట, జూలై 8: డిజిటల్ పరికరాల స్థానంలో పుస్తకాలు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ సూచించారు. జగద్గిరిగుట్ట షిర్డీహిల్స్‌లో స్థానిక నేత దాసు ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ గ్రంథాలయాన్ని సోమవారం కార్పొరేటర్ జగన్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏసురత్నం, వేణుయాదవ్, అశోక్, మారయ్య, జైహింద్, రాములు తదితరులు పాల్గొన్నారు.

లింకు రోడ్డుతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

జగద్గిరిగుట్ట, జూలై 8: జగద్గిరిగుట్ట నుంచి భూదేవిహిల్స్ మీదుగా కూకట్‌పల్లికి లింకురోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తీరుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్‌లో సోమవారం ఆయన పర్యటించి.. స్థానికులతో సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో విద్యుత్, డ్రైనేజీ మరమ్మతుతో పాటు రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, రావుల శేషగిరి, స్థానికనేతలు పాల్గొన్నారు.

డ్రైనేజీలను శుభ్రం చేయాలి..

ఆల్విన్ కాలనీ డివిజన్ ధరణీనగర్‌లో నాలాలు పూడికతో నిండిపోవడంతో రహదారిపైకి వస్తున్న మురుగునీటి సమస్యను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీలను, మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వ్యర్థాలను తొలగించాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికపుడు తగు పర్యవేక్షణ చేపట్టి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్, సంతోష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్, జూలై 8

ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

బాలానగర్, జూలై 8 : గౌతంనగర్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని గౌతంనగర్‌లో ఆయన పర్యటించి కమ్యూనిటీమాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పురాతన కమ్యూనిటీ హాల్ స్థానంలో కొత్త కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గౌతంనగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణం చేయడం కోసం ప్రతిపాదనలు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆయన సూచించారు. గౌతంనగర్ వాసులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంలో కీలకపాత్ర పోశించనున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి పనులు చేపట్టడం కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడుతానన్నారు.

కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

కాలనీ సమస్యలపై చర్చిస్తున్న కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కొండాపూర్, జూలై 8: స్థానికంగా నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ అన్నారు. గచ్చిబౌలి గులషన్ నగర్, వడ్డెర బస్తీలో స్థానిక నాయకులతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతనంగా వేసిన డ్రైనేజీ వేసిన తరువాత మిగిలిన మట్టిని వెంటనే ఎత్తివేయాలని అధికారులకు సూచించారు. కొన్ని చోట్ల వీధి లైట్లు పాడవడంతో వాటికి మరమ్మతులు చేయాలన్నారు. కిందకు వేలాడుతున్న విద్యుత్ కేబుళ్లను క్రమబద్ధీకరించాలని సూచించారు. రోడ్లు వేసినప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కరీం, రాము, వాలి ఉద్దీన్, కమర్ ఉద్దీన్, రహమతుల్లా, భద్ర, రియాజ్ ఉద్దీన్, సయ్యద్ అయాజ్, ఇమ్రోజ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతతోనే కుటుంబ అభివృద్ధి

దుండిగల్, జూలై 8: మహిళా సాధికారతతోనే కుటుంబ అభివృద్ధి సాధ్యమవుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద అన్నారు. సూరారం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ ఎస్సీ మహిళా కమ్యూనిటీ హాల్‌లో స్వయంశక్తి గాజులరామారం పట్టణ మహిళా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్‌ను సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. మహిళలంతా ఐక్యతగా ఉండి ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, మహిళా సంఘం నాయకురాలు దేవకరుణ, సంధ్య, షభానా, భ్రమరాంబ, అరుణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

క్రీడల్లో తెలంగాణ సత్తాను మరింతగా చాటాలి

విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, జూలై 8: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు యువత రాణించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. కఠోరమైన శిక్షణతో దేశ విదేశాల్లో జరిగే పోటీల్లో తెలంగాణ సత్తాను మరింతగా చాటాలన్నారు. నేపాల్ ఖేలో భారత్ యూత్ గేమ్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటిన తెలంగాణ క్రీడాకారులు చక్రత్ సాయి హన్సిక, సర్దార్ అంగద్ సింగ్ సిద్దూ, గుగ్లావత్ సురేందర్, బైరగోని అరున్‌కుమార్, రాథోడ్ సంతోష్‌ను ఎమ్మెల్యే గాంధీ సోమవారం తన నివాసంలో అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత తాము ఎంచుకున్న మార్గాల్లో తగు క్రమశిక్షణతో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కృషి పట్టుదల ఉంటే విజయం వరిస్తుందని, అందుకు సరైన అభ్యసన తోడైతే మరిన్ని ఫలితాలు తోడవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సంజీవరెడ్డి, భాస్కర్, యశ్వంత్ పాల్గొన్నారు.

పార్కుల నిర్వహణపై దృష్టిసారించాలి

కేపీహెచ్‌బీ కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న జడ్సీ అపూర్వ్ చౌహాన్, డీసీ రమేశ్, అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 8: పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, పారిశుధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ అన్నారు. సోమవారం మూసాపేట సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భరత్‌నగర్ కాలనీ నుంచి కేపీహెచ్‌బీ కాలనీ వరకు ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఎస్ఎఫ్ఏ పనితీరును పరిశీలించి.. పరిసరాలు పరిశుభ్రంగా మార్చేందుకు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. మూసాపేట శక్తినగర్‌లో వర్షనీటి లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించి.. ఈ ప్రాంతంలో నీరు నిలువకుండా పనులు చేపట్టాలన్నారు. రోడ్డు పనులు చేస్తున్నప్పుడు లెవల్స్ సరిగా చూసుకోవాలని, వరదనీరు సజావుగా దిగువ ప్రాంతానికి వెళ్లేలా చేయాలన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లో నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలన్నారు. కాలనీ 3వ ఫేజ్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కులను, క్రీడా ప్రాంగాలను ప్రజలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీ 4వ ఫేజ్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో లీకేజీ సమస్యలు పరిష్కరించాలని, భవనానికి కావాల్సిన మరమ్మతు పనులు చేయాలన్నారు. కాలనీ 7వ ఫేజ్ సమీపంలోని హిందూ శ్మశానవాటిక (కైలాసవాసం)ను పరిశీలించి... తోట నిర్వహణపై దృష్టి సారించాలని, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీసీ రమేశ్, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, గెమ్స్ ఇన్‌స్పెక్టర్ వీరానంద్, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభం, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఏఎంహెచ్‌వో సాల్మన్‌రాజ్‌పై చర్యలు తీసుకోవాలని జడ్సీకి ఫిర్యాదు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 8: మూసాపేట సర్కిల్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఎస్ఎఫ్ఏలు, కార్మికులను వేధిస్తున్న ఏఎంహెచ్‌వో సాల్మన్‌రాజ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ.. మూసాపేట సర్కిల్ పరిధిలోని శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్(ఎస్ఎఫ్ఏ)లు సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన సున్నం, బ్లీచింగ్‌పౌడర్, చీపుర్లు సకాలంలో ఇవ్వడం లేదని, చనిపోయిన కార్మికులకు చెందిన ఫైల్స్‌పై సంతకం చేయాలంటే ఇబ్బంది పేడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఏలపై వేధింపులకు పాల్పడుతన్న డాక్టర్‌పై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

జీడిమెట్ల, జూలై 8: షాపూర్‌నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన కే.సంజయ్ (25), మహారాష్ట్రకు చెందిన బి.మహేశ్ (23) ఎన్ఎల్‌బీనగర్‌లో నివాసం ఉంటున్నారు. నిందితులిద్దరూ ఈనెల 5న రాత్రి నల్లపోచమ్మ ఆలయంలోని హుండీని పగులగొట్టి రూ.1,000 నగదును దొంగలించారు. సీసీ టీవీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు ఎన్ఎల్ బీనగర్‌లో అరెస్టు చేసి రూ.1000 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. తమ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్, జూలై 8: పురుగుల మందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ ప్రాంతానికి చెందిన మాలోతు భీక్య(59) కొనెండ్ల కిందట నగరానికి వలస వచ్చి కొంపల్లిలో శివాలయం ప్రాంతంలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. కాగా వృత్తిరీత్య కొంపల్లిలోని బిగ్‌బాస్కెట్‌లో హౌస్‌కీపింగ్‌గా పని చేస్తున్నాడు. రోజువారి పనిలో భాగంగా ఆదివారం ఉదయం పనికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో తన భార్యకు ఫోన్ చేసి తాను ఎలుకల మందు సేవించానని చెప్పడంతో హుటాహుటిన భార్య పని ప్రదేశానికి వెళ్లి కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సోమవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 8 : దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్‌స్టాప్‌లో కూకట్‌పల్లి వైఎస్సార్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్ పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ అభిమాన సంఘం నేతలు ఎస్.సతీశ్‌రెడ్డి, బి.మధుసూదన్‌రెడ్డి, వి.ఉపేందర్‌రెడ్డి, బి.శివారెడ్డి, జి.ఎల్.ఎన్.రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, డి.అరవింద్ రెడ్డి, ఎస్‌క్రీమ్ వెంకట్‌రెడ్డి, చెన్నారెడ్డి, కాముని నర్సింహారెడ్డి, జనగాం సురేశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, సురేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, రమేశ్, రామకృష్ణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

- వైఎస్సార్ విగ్రహానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి, సత్యంశ్రీరంగం, గాలి బాలాజీ, నర్సిరెడ్డి భూపతిరెడ్డి, జీ.వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్, ప్రవీణ్‌కుమార్, అరవింద్‌రెడ్డి, మేకల మైకల్, సంజీవరావు, నాగమల్లేశ్వర్‌రావు, అబ్దుల్‌బాకీ, సునీల్ యాదవ్, గోపాల్‌చౌదరి, అప్పారావు, రేష్మా, మణి, తదితరులు ఉన్నారు.
- వైఎస్సార్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ప్రీతంరెడ్డి, వైఎస్సార్ అభిమానులు ఉన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, వైఎస్ఆర్ అభిమాన సంఘం నేతలు మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, జీఎల్ఎన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, తులసీరెడ్డి, చెన్నారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు

- మియాపూర్: మాజీ సీఎం వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- మాదాపూర్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కుసుమ కుమార్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని 100 ఫీట్ల రోడ్డులో దివంగత నేత వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కేపీహెచ్‌బీ కాలనీలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్, మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి, సత్యం శ్రీరంగం, వెంకటేశ్వర్‌రావు, మైకల్, అరవిందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు

అల్లాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రవీందర్

అల్లాపూర్, జూలై 8: అల్లాపూర్ డివిజన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా గడ్డమీద రవీందర్ ముదిరాజ్‌ను సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పిలుపు మేరకు సోమవారం అల్లాపూర్‌లో సమావేశం నిర్వహించి.. అధ్యక్షుడిగా రవీందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా శ్యామ్ ముదిరాజ్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, చెన్నయ్య ముదిరాజ్, గడ్డమీద రాజు ముదిరాజ్, పిట్టల రాజు ముదిరాజ్, ఆర్ సాయిలు ముదిరాజ్, సుదర్శన్ ముదిరాజ్, తుంగం శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు మడుపు జితేందర్ ముదిరాజ్, మాజీ ప్రధాన కార్యదర్శి గోనెల సుదర్శన్ ముదిరాజ్ తదిరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శేరిలింగంపల్లి, జూలై 8: లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, చెన్నయ్య, యాదగిరి, లక్ష్మి, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యమానికి నిసార్ సేవలు గొప్పవి

జగద్గిరిగుట్ట, జూలై 8: తెలంగాణ కోసం తన సాహిత్యం, గళంతో నిసార్ ఉద్యమించాడని పలువురు వక్తలు తెలిపారు. నిసార్ వర్ధంతి సందర్భంగా జగద్గిరిగుట్టలో ఆయన చిత్రపటానికి నివాళుర్పించారు. జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, రాష్ట్ర ప్రజానాట్యమండలి అధ్యక్షుడు కె.శ్రీనివాస్, అరుణోదయసమాఖ్య అధ్యక్షుడు బైరాగిమోహన్, కిషన్‌రావు, ఏసురత్నం, ఉమామహేశ్, మాపల్లెశంకర్, సయ్యద్‌రషీద్, ప్రమీల పాల్గొన్నారు.

స్వచ్ఛ పరిసరాలు నెలకొల్పుదాం: జడ్సీ ఉపేందర్‌రెడ్డి

పరిసరాలను పరిశీలిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, జూలై 8: పరిసరాల పరిశుభ్రత.. పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పుటంలో ఆయా విభాగాలు సమన్వయంతో పని చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి సూచించారు. తద్వారా ఐటీకి కేంద్రమైన జోన్‌ను ఆదర్శంగా తయారు చేసుకోవచ్చునన్నారు. జోన్ పరిధిలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్ నుంచి మల్కం చెరువు వరకు రెండున్నర కిలోమీటర్ల మేర పలు విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి కాలినడకన పారిశుధ్యం, పుట్‌పాత్‌లు, వ్యర్థాల తొలగింపు, పాదచారులు రహదారి దాటేందుకు ఏర్పాటు చేయాల్సిన జీబ్రా క్రాసింగ్ ప్రాంతాలను జడ్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారులను నిత్యం శుభ్రం చేయాలని, వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య సిబ్బంది మధ్యాహ్నం ఒంటిగంట వరకు పని చేయాలని సూచించారు. పుట్‌పాత్‌లపై ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని, చిరు వ్యాపారాలు ఆక్రమించకుండా పర్యవేక్షించాలని జడ్సీ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నాగేశ్ నాయక్, ఎస్ఆర్‌పీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో పలు సమస్యలపై వినతులు

గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో వినతిపత్రాలను స్వీకరిస్తున్న డీసీ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్, జూలై 8: ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయాల్లో జరిగే ప్రజావాణి కార్యక్రమం కుత్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో 11 సమస్యలపై, కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో 10 సమస్యలపై ఫిర్యాదులు వచ్చిన్నట్లు డీసీలు మల్లారెడ్డి, నర్సింహ తెలిపారు. టౌన్‌ప్లానింగ్-3, ఇంజినీరింగ్-12, ఎల్క్ట్రికల్-3, టాక్స్-1, ఎంటమాలజీ-, యూజీడీ-1ల చొప్పున ఫిర్యాదులు అందిన్నట్లు తెలిపారు.